క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



అల్వాల్: పోషణ పక్షంలో భాగంగా అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, మెడికల్ ఆఫీసర్, సిబ్బంది సోమవారం గర్భిణీ స్త్రీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు.

30న సీతారాముల కల్యాణం

కుషాయిగూడ: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు సోమవారం గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఓటర్ కార్డులు అందజేత



ఓటర్ కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

అల్వాల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైనవారందరూ కలిగి ఉండాలని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం కౌకూర్ భరత్‌నగర్ కాలనీలో గతంలో మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 800 మందికి పైగా ఓటర్ నమోదును చేసుకున్నారు. అందులో మంజూరైన 300 ఓటర్ కార్డులను సోమవారం వారికి అందజేశారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యం



వెంకటాపురం డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హాత్ సే హాత్ యాత్రలో భాగంగా సోమవారం వెంకటాపురంలో నిర్వహించిన యాత్రలో నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వారి ఇబ్బందులను తొలగించే విధంగా కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవ్‌కుమార్, నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, డోలి రమేష్, శివకుమార్ పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా బోధించాలి



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

బోడుప్పల్: విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యా బోధన చేయాలని ఆమె సూచించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్యయాదవ్, విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తన సంగీత విభావరి



అల్వాల్: అల్వాల్ హరిదాస మండపం వద్ద 72వ వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం తిరుపతి దేవస్థానం అస్థాన గాయకుడు బొమ్మిశెట్టి రఘునాథ్ అన్నమయ్య సంకీర్తన సంగీత విభావరి నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆంజనేయ స్వామికి చందనాభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చెత్త రహిత నగరం దిశగా ‘పీర్జాదిగూడ’

- ఇళ్ల వద్దే తడి, పొడి చెత్త వేరు చేస్తున్న ప్రజలు
- స్వచ్ఛ ఆటోల ద్వారా సమీకృత శుద్ధీకరణకు తరలింపు

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, పాలకవర్గం కృషి చేస్తోంది. అందుకు స్వచ్ఛ కార్మికులు(స్వీపర్లు), స్వచ్ఛ ఆటో కార్మికులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఇళ్ల యజమానులు తమ ఇళ్ల వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందిస్తున్నారు. సేకరించిన చెత్తను స్వచ్ఛ ఆటోల ద్వారా సమీకృత శుద్ధీకరణకు తరలిస్తున్నారు. డీఆర్‌సీసీ కేంద్రంలో వేరు చేసిన చెత్తను కొనుగోలు చేసే కంపెనీలకు విక్రయిస్తారు. 100 శాతం చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడంతోపాటు ఆదాయం సమకూర్చుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

◆ రోజుకు 40 టన్నుల చెత్త సేకరణ

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ 11.05 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉంది. 115 కాలనీలుండగా 34 వేల ఇళ్లు ఉన్నాయి. స్వచ్ఛ కార్మికులు (స్వీపర్లు) 130 మంది పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఇళ్ల నుంచి 35 నుంచి 40 టన్నుల చెత్త వస్తోంది. 50 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇండ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నారు.

◆ చెత్త సమీకృత శుద్ధీకరణకు తరలింపు

ఇంటి యజమానులే తడి చెత్తను పొడి చెత్తను వేరు చేస్తున్నారు. అలా చేసిన చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందిస్తుండగా వారు చెత్తను సమీకృత శుద్ధీకరణ పార్కుకు తరలిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక యంత్ర పరికరాలతో చెత్తను మూడు విభాగాలుగా వేరు చేస్తున్నారు. తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తగా వేరు చేస్తున్నారు. అలా వేరు చేసిన వస్తువులను వాటిని కొనుగోలు చేసే కంపెనీలకు విక్రయిస్తున్నారు. హానికారక చెత్తను (శానిటరీ ప్యాడ్స్)ను పూర్తిగా కాల్చి వేసేందుకు ఇన్సిండెటర్‌ను అమర్చారు.



సమీకృత శుద్ధికరణ కేంద్రంలో చెత్తను రీసైక్లింగ్ చేస్తున్న సిబ్బంది



తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ

◆ స్వచ్ఛ కార్మికుల సేవలు ప్రశంసనీయం

నగర పాలక సంస్థను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛ కార్మికుల (స్వీపర్లు) కృషి మరవలేనిది. నగర పాలక సంస్థ రోడ్లు, వీధులను ఊడుస్తూ పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేస్తున్న శ్రమ ప్రశంసనీయం. ఒకప్పుడు మురికి కూపంగా ఉన్న నగర పాలక సంస్థ నేడు అధికారులు, పాలకవర్గం, స్వచ్ఛ కార్మికులు, స్వచ్ఛ ఆటోల కృషి వల్ల పరిశుభ్రంగా కనిపిస్తుంది. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు చెత్త, చెదారాన్ని రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించి నగర పాలక సంస్థను పరిశుభ్రంగా ఉండేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.

ఆదర్శం.. అభినందనీయం



ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు

కాప్రా: కంపోస్టు ఎరువుల తయారీతో కాప్రా డివిజన్ సాకేత్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు అన్నారు. కంపోస్టు ఎరువుల తయారీపై అసోసియేషన్ ప్రతినిధులను అభినందిస్తూ సోమవారం వారికి జీహెచ్ఎంసీ తరఫున ప్రశంసాపత్రం అందించారు. సాకేత్ కాలనీలో మొత్తం 19 పార్కులున్నాయని అందులోని 10 పార్కులలో కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేసి చెట్ల నుంచి రాలిన ఆకులతో ఎరువులు తయారు చేస్తుండటం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శరత్ చంద్రారెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

తైబజారు వేలం వాయిదా

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తైబజారు వేలం పాటలో ప్రభుత్వ అప్సెట్ ప్రైస్ రూ.32,73,818 చేరుకోనందును వేలంను వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వాణిరెడ్డి వెల్లడించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మళ్లీ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు ఇవ్వాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

మౌలాలి:మౌలాలిలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళ, శిశు, సంక్షేమ శాఖ అల్వాల్ ప్రాజెక్టు అధికారి స్వాతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అవసరమన్నారు. సూపర్‌వైజర్ వింధ్యవాహిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పేదింట వెలుగులు



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లతో అందిస్తున్న ఆర్థిక సహాయం ఆడబిడ్డలు గల పేదింటి జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్‌శేఖర్, బన్నాల గీత, బండారు శ్రీవాణివెంకట్రావు పాల్గొన్నారు.

అవయవ దానం



వనజ (ఫైల్)

కాప్రా: బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సికింద్రాబాద్ నివాసి కాప్రా సర్కిల్‌లోని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల డిస్ట్రిక్ట్ 320సీ ప్రస్తుత గవర్నర్ చింతల వెంకటనారాయణరెడ్డి సతీమణి వనజ అనారోగ్యంతో మల్‌పేట్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు.దీంతో కుటుంబ సభ్యులతో చర్చించి అవయవదానానికి ముందుకొచ్చారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ, మల్లన్న స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ అనిత యాదగిరి

బోడుప్పల్: బోడుప్పల్ దేవేందర్‌నగర్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ, మల్లన్న స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు గోపు రాము పాల్గొన్నారు.

తల్లిపై దాడి చేసి కుమారుడికి ఏడాది జైలు



నిందితుడు ఎల్సర్ డెన్సన్

ఉప్పల్: తల్లిపై దాడి చేసి గాయపరిచిన కుమారుడికి న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ శారదానగర్ ప్రాంతానికి చెందిన ఎల్సర్ డెన్సన్ (26) చికెన్ పకోడ దుకాణం నిర్వహిస్తాడు. ప్రతి రోజూ మద్యంతాగి ఇంటికి వచ్చి తల్లి ఎస్తేరును వేధించేవాడు. 2020 జులై 24న మద్యం తాగి ఇంటికి వచ్చి డబ్బులు కావాలని వేధించడంతో పాటు కొట్టడం ప్రారంభించాడు. అదే మత్తులో చాకు తీసుకుని తల్లి మీద దాడి చేయడానికి ప్రయత్నించగా అమె తప్పించుకుని పారి పోయింది. ఈ క్రమంలో తల్లి గాయపడింది. దీంతో బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన ఉప్పల్ పోలీసులు సరైన సాక్ష్యాధారాలు సమకూర్చి కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం మల్కాజిగిరి కోర్టు నిందితునికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఉప్పల్ పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ జక్క వెంకట్ రెడ్డి,కార్పొరేటర్లు

- రూ.236 కోట్లతో పీఎంసీ అంచనా బడ్జెట్
- అభివృద్ధి ,సంక్షేమం లక్ష్యంగా వార్షిక బడ్జెట్–మేయర్

మేడిపల్లి: వేసవిలో తాగునీటి సమస్యలేకుండా మంచినీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ (పీఎంసీ) కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

◆ ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా 24 గంటల మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకుంటామని మేయర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కార్పొరేటర్లు, అధికారులు భాగస్వాములై అన్నివిధాలుగా సహకరించాలన్నారు. అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ 2023–24 సంవత్సర అంచనా బడ్జెట్ తో పాటు 2022–23 సవరణ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

◆ అంచనా ఆదాయం, ఇతర గ్రాంట్ల అంచనా ఆదాయం మొత్తం రూ.236 కోట్ల అంచనా వ్యయమని అధికారులు వెల్లడించారు.

పోషకాహారంపై అవగాహన



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలు వివరించారు.అనంతరం ప్రభుత్వం నుండి వచ్చిన పోషకాహార ప్యాకెట్లు, గుడ్లు అందజేశారు. ఆశాలత,వరలక్ష్మి, ప్రమీల,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శనగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ:ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లి డివిజన్, ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణలో భాగంగానే ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, రమాదేవి, ప్రమోద్ కుమార్, శ్యాంసుందర్, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే సమస్యలకు పరిష్కారం



కాప్రాలో దళిత్ శక్తి ప్రోగ్రాం స్వరాజ్యపాదయాత్ర

కాప్రా: రాజ్యాధికారంతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలకు పరిష్కారమని అందుకే మనరాజ్యం సాధించుకుందామని దళిత్‌శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహారాజ్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా చేపట్టిన స్వరాజ్యపాదయాత్ర సోమవారం కాప్రా సర్కిల్‌లోకి ప్రవేశించింది. 2022 మార్చి 15న నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర 500 రోజుల పాటు 10 వేల కిలోమీటర్లు కొనసాగి జులై 30న మేడ్చల్ జిల్లాలో ముగియనుంది. ప్రస్తుతం ఈ పాదయాత్ర కాప్రా సర్కిల్‌కు చేరుకుని గాంధీనగర్, కాప్రా, వంపుగూడ, ఎల్లారెడ్డిగూడ మీదుగా అల్వాల్ సర్కిల్‌లోకి ప్రవేశించింది. దళిత్ శక్తి ప్రోగ్రాం ప్రతినిధులు లక్ష్మణ్ మహారాజ్, రాజ్‌కమల్, సైదులు, మహేష్, సత్యనారాయణ, రాకేష్, గాలయ్య, కృష్ణ, హరి, మోహన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్స్ ఆఫీసర్‌ను అభినందించిన సీపీ



ప్రదీప్‌కుమార్‌ను అభినందిస్తున్న సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

అల్వాల్: ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాచకొండ పోలీస్ కమిషనరేటర్ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్రదీప్ కుమార్ గోల్డ్ మెడల్‌కు లభించింది. ఈ నెల 26న రవీంద్రభారతిలోపోటీలు జరిగాయి. సోమవారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో రాచకొండ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ప్రదీప్ కుమార్‌ను అభినందించారు.

పేదలకు అండగా బీఎల్ఆర్ ట్రస్ట్

కుషాయిగూడ: ఆపదలో ఉన్న పేదలకు బీఎల్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తోందని ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ అన్నారు. ప్రమాదవశాత్తు గాయపడి చెయ్యి విరిగిన చర్లపల్లి డివిజన్, సోనియా గాంధీనగర్ కాలనీకి చెందిన కూలీ సమ్మయ్యకు సోమవారం 10 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొల్లూరి రమేష్ కుటుంబ సభ్యులకు ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు.



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న నేమూరి మహేష్‌గౌడ్

అభివృద్ధి సంక్షేమానికే ప్రాధాన్యం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని భగత్ బస్తీ, సాయికృష్ణనగర్ కాలనీలో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకటరావుతో కలిసి రూ.25 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటినుంచీ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ కోట్లాది రూపాయలు నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ పల్లె రవీందర్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నగేష్, శ్రీనివాస్, పర్వతాలు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు మంత్రి హామీ



మంత్రి హరీష్ రావును కలిసి వివరిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం రామంతాపూర్ ప్రాంతానికి చెందిన సునీత దంపతుల కుమారుడు చేతన్ (5) కాళ్లకు సంబంధించిన అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి మంత్రి తన్నీరు హరీష్ రావుకు సోమవారం బాధితులతో కలిసి పరిస్థితిని విన్నవించారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. త్వరలో ఆపరేషన్ చేయించి కుటుంబాన్ని ఆదుకోనున్నట్లు తెలిపారు.

రూ.34.25 లక్షలు పలికిన మేడ్చల్ తైబజారు

మేడ్చల్: మేడ్చల్ తైబజారు వసూలు ధర వేలంలో రూ.34.25లక్షలు పలికింది. తైబజారు కోసం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వేలం పాట నిర్వహించగా మేడ్చల్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి రూ.34.25లక్షలకు దక్కించుకున్నారని మున్సిపల్ ఆర్ఐ రాంచందర్ తెలిపారు. నిబంధనల ప్రకారం పట్టణంలో తైబజారు వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయరాదని ఆయన సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో పంచాయతీ నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అంతర్గత మురికి కాల్వ పనులను సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, మయూరి, శ్వేత, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కోఆప్షన్ సభ్యులు ఇన్నారెడ్డి, సురేశ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ స్థానికులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డు లబ్ధిదారుల వివరాలు నమోదు



ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ–శ్రమ్ కార్డు, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల వివరాలు సోమవారం నమోదు చేయించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభంజన్, స్వప్న, సంధ్యారాణి, కవిత, సత్యనారాయణ, సురేశ్, బాలరాజ్, ప్రవీణ్‌రెడ్డి, బాలుయాదవ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.